
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
బుధవారం 17 ఏప్రిల్ 2024



బిల్లు కాదు.. బాదుడు...!

వైసీపీ పాలనలో భారీగా కరెంటు బిల్లుల పెంపు

- 200 శాతం వరకు పెరుగుదల
- ట్రూఅప్, యూజర్ చార్జీల పేరుతో అదనపు భారం
- ఇష్టారాజ్యంగా టారిఫ్‌ల మార్పు
- సామాన్య, మధ్యతరగతి ప్రజల గగ్గోలు
- వినియోగంలో మార్పు లేకపోయినా భారం పెరగడంపై ఆవేదన
- ప్రభుత్వ తీరుపై ఆగ్రహం


అధికారంలోకి వస్తే.. విద్యుత్ బిల్లులు పెంచనని.. జగన్ హామీ ఇచ్చారు.. అధికారం చేపట్టాక బిల్లులు పెంచడమే పనిగా పెట్టుకున్నారు.. ట్రూఅప్, యూజర్ చార్జీలు అంటూ బాదేశారు.. ఇష్టారాజ్యంగా టారిఫ్‌లు మార్చి.. వినియోగదారులపై భారం మోపారు.. 200 శాతందాకా బిల్లులు పెంచేశారు.. దీంతో స్విచ్‌పై చేయి వేయాలంటేనే జనం భయపడిపోతున్నారు..




ఆర్థిక భారం పెరిగింది

మా ఇంటికి గతంలో నెలకు రూ.200 వచ్చే విద్యుత్‌బిల్లు ప్రస్తుతం రూ.650 వరకు వస్తోంది. మూడునెలలుగా మరింత ఎక్కువగా వస్తోంది. ఇది ఇంకా ఎంతకు పెరుగుతుందోనని ఆందోళనగా ఉంది. విద్యుత్ చార్జీలు తరచూ పెంచడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం.

- చీమల రామాంజి, ధర్మవరం






విద్యుత్ సబ్‌స్టేషన్

ధర్మవరం, ఏప్రిల్ 16: అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులు పెంచబోనని ప్రతిపక్ష నేతగా హామీ ఇచ్చిన జగన్ మాట తప్పారు. అధికారంలోకి వచ్చాక పలురకాల చార్జీలు, టారిఫ్‌ల మార్పు మాటున కరెంటు బిల్లులు భారీగా పెంచేశారు. ఏకంగా 100 నుంచి 200 శాతం విద్యుత్ బిల్లులు పెరిగిపోయాయి. బాదుడే లక్ష్యంగా పెట్టుకున్నారు. వైసీపీ అధికారంలోకి రాక ముందు రూ.200 వచ్చిన విద్యుత్ బిల్లు ప్రస్తుతం రూ.600 వరకు వస్తోంది. దీంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. స్విచ్ వేయాలంటేనే జంకాల్సిన పరిస్థితి ఏర్పడింది. వినియోగంలో ఏమాత్రం తేడాలేకున్నా.. బిల్లు మాత్రం ఇంతలా పెరగడం ఏంటని వినియోగదారులు మండిపడుతున్నారు.



పెరిగిన భారం

వినియోగదారులపై గత ఐదేళ్లలో విద్యుత్‌భారం భారీగా పెరిగింది. టీడీపీ హయాంలో రూ.200 విద్యుత్ బిల్లు చెల్లించినవారు ప్రస్తుతం రూ.500 నుంచి 650 వరకు కడుతున్నారు. ఇళ్లకే కాకుండా చిన్నచిన్న దుకాణాల నిర్వహణదారులకు కూడా విద్యుత్ బిల్లులు షాక్ కొడుతున్నాయి. మొత్తంగా వేసవిలో వచ్చే బిల్లులను తలచుకుంటే భయమేస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. ఏదిఏమైనా వైసీపీ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలపై విద్యుత్ చార్జీల రూపేణా మోయలేని భారం మోపిందని పలువురు పేర్కొంటున్నారు.



వైసీపీ ప్రభుత్వం పలుమార్లు విద్యుత్ చార్జీలను పెంచింది. ట్రూఅప్, యూజర్ చార్జీలు తదితర పేర్లతో అదనపు భారం మోపింది. గతంలో విద్యుత్ బిల్లు రూ.300 వచ్చిన వినియోగదారులకు ఇప్పుడు రూ.600 నుంచి రూ.700 అంతకంటే ఎక్కువ వస్తోంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలు విద్యుత్ బిల్లుకు బడ్జెట్ లో రూ.300కు మించి పెట్టేందుకు ఇష్టపడరు. అందుకు అనుగుణంగానే వినియోగం ఉండేలా చూసుకుంటారు. వినియోగం విషయంలో జాగ్రత్తలు పాటిస్తున్నా తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నా బిల్లులు మాత్రం తగ్గడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ఫ్యాన్ల వినియోగాన్ని చాలా వరకు తగ్గిస్తున్నామనీ, అయినా బిల్లు మాత్రం తగ్గడంలేదని వాపోతున్నారు.

వినియోగంలో తేడా లేకున్నా..

నెలవారీగా పెరుగుతున్న విద్యుత్ బిల్లులను చూస్తుంటే ఫ్యాన్ వేసుకోవడానికి భయమేస్తోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధిక బిల్లులు వస్తున్నాయని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా సిబ్బంది పట్టించుకోవడం లేదని వారు మండిపడుతున్నారు. ప్రజలపై భారం మోపే ముందు ప్రభుత్వాలు ఆలోచన చేయాలనీ, ఇతర ఖర్చులను విద్యుత్ చార్జీల రూపంలో సమకూర్చుకునేందుకు ప్రయత్నించడం వల్లే సమస్య తలెత్తుతోందని వినియోగదారులు వాపోతున్నారు.



దారుణంగా పెరిగిన కరెంటు చార్జీలు

మా ఇంట్లో 12 ఏళ్లుగా రెండు ఫ్యాన్లు, టీవీ, నాలుగు లైట్లు వాడుతున్నాం. ఇందులో ఎలాంటి మార్పు లేదు. రోజువారీ విద్యుత్‌వినియోగంలో కూడా తేడా లేదు. ఐదేళ్లుగా విద్యుత్ బిల్లు భారీగా పెరుగుతూ వస్తోంది. అప్పట్లో రూ.200లోపు వచ్చే బిల్లు ప్రస్తుతం రూ.500 వచ్చింది. ఇది మోయలేని భారమే.

- తుమ్మల చంద్ర, నల్లాయకుంటపల్లి, ముదిగుబ్బ మండలం

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	39.0 27.0	39.0 26.0	40.0 27.0	38.0 24.0	38.0 26.0

నేడు రాములోరి కల్యాణం

- శ్రీరామనవమికి ఆలయాలు ముస్తాబు


విద్యుద్దీపాల వెలుగులో సూగూరు ఆంజనేయస్వామి ఆలయం



శ్రీ రామచంద్రమూర్తి, సీతామాత కల్యాణోత్సవానికి సర్వత్రా ఏర్పాట్లు చేశారు. బుధవారం శ్రీరామనవమిని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ఆలయాలను ముస్తాబు చేశారు. రాములోరి కల్యాణానికి ఏర్పాట్లు చేశారు. హిందూపురంలోని ప్రసిద్ధ సూగూరు ఆంజనేయస్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. సూగూరు ఆంజనేయస్వామి దేవాలయంలో ఉదయం 8 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం, 11.30కి సీతారామలక్ష్మణ ఆంజనేయ విగ్రహాలతో రథోత్సవం, 4.30 గంటలకు ఉట్లపరుష, 18వ తేదీన ఉదయం 10 గంటలకు పట్టాభిషేకం, సాయంత్రం 5 గంటలకు పూలపల్లకి, నగరోత్సవం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

నామినేషన్లకు ఏర్పాట్లు చేయండి

కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు

పుట్టపర్తి, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు.. నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఏఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గురువారం సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందన్నారు. అదేరోజు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణ గది, పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు భద్రత, నిఘా పెంచాలని ఆదేశించారు. నామినేషన్ వేసే అభ్యర్థి కొత్తగా బ్యాంకు ఖాతా వివరాలను ఇవ్వాల్సి ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, జిల్లాలోని నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు జేసీ అభిషేక్‌కుమార్, పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, గౌరీశంకర్ పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోండి: కలెక్టర్

పుట్టపర్తి, ఏప్రిల్ 16: సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ రోజున ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్‌అరుణ్‌బాబు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12 ద్వారా దరఖాస్తును ఈనెల 24, 25 తేదీల్లో ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేయాలన్నారు.

సంచార వైద్యం.. చోద్యం..!

- సక్రమంగా అందని పశువైద్య సేవలు
- పాడి రైతులకు తప్పని ఇబ్బందులు


ఈతకు ఇబ్బందిపడిన పాడి ఆవు..


వైద్యుడు లేక మూతపడిన కల్లుమర్రి పశువైద్యశాల

మడకశిర రూరల్, ఏప్రిల్ 16: పశుసంచార వైద్య సేవలు సక్రమంగా అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అత్యవసర సమయాల్లో పాడిరైతులు ఫోన్ చేసినా.. సరిగా స్పందించడంలేదనీ, వైద్య సేవల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి. పశువులు వ్యాధిబారిన పడినపుడు చికిత్స కోసం దూరప్రాంతంలోని పశువైద్యశాలలకు తీసుకెళ్లడమంటే వ్యయప్రయాసలతో కూడిన పని. ఈనేపథ్యంలో పాడిరైతుల కోసం సంచార పశువైద్య సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. అందు కోసం ప్రత్యేక వాహనాలను సైతం ఏర్పాటు చేసింది. టోల్‌ఫ్రీ నంబర్ 1962ను కూడా కేటాయించింది. పశువులు తీవ్ర అనారోగ్యం బారిన పడినపుడు, అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి, వివరాలు తెలపాలి. వెంటనే పశుసంచార వైద్య సేవల వాహనం అక్కడికెళ్లి, పశువులకు చికిత్స అందించాలి. టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించినా.. సకాలంలో స్పందించడం లేదని పాడి రైతులు వాపోతున్నారు. మండలంలోని మణూరు రంగాపురం గ్రామ రైతు రైతు హరీషప్పకు చెందిన పాడి ఆవు మంగళవారం ఈత కోసం ఇబ్బందులు పడుతోంది. దూడ తల మాత్రమే బయటకు వచ్చింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆవు ఈతకోసం రైతు అనేక ఇబ్బందులు పడ్డాడు. సంచార పశువైద్య సేవల వాహనానికి సంబంధిచిన టోల్‌ఫ్రీ నంబర్ 1962కు రైతు ఫోన్ చేశాడు. వారు మధ్యాహ్న సమయంలో వచ్చారు. ఆవును చూసి, వైద్యం అందించకుండా ఈత ఆలస్యం అవుతుందని సలహా ఇచ్చి వెళ్లిపోయారని రైతు వాపోయాడు. వారు వెళ్లిన కాసేపటికే ఆవు ఈనింది. అక్కడే ఉండి వైద్యం అందించాల్సిన వాహన సిబ్బంది వెళ్లిపోవడం ఏంటన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, సంచార పశువైద్య సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

పశువైద్యం.. నిర్వీర్యం..

మడకశిర నియోజకవర్గంలో పశువైద్య సేవలు నిర్వీర్యమయ్యాయి. మండలంలో కలుమర్రి, నీలకంఠాపురం, గుండుమల, మడకశిర వెటర్నరీ వైద్యశాలలు ఉన్నాయి. నీలకంఠాపురంలో ఒక్క డాక్టర్ మాత్రమే ఉన్నారు. కల్లుమర్రి, గుండుమల, మడకశిరలో పశువైద్యశాలల్లో డాక్టర్ లేరు. దీంతో పశువైద్యసేలు అటకెక్కాయి.

సరైన సమాచారం ఇవ్వలేదు

మణూరు రంగాపురానికి చెందిన పాడి రైతు టోల్‌ఫ్రీ నంబర్ 1962కి ఫోన్ చేశారు. సరైన సమాచారం ఇవ్వలేదు. పాడి ఆవు మేత మేయడం లేదని మాత్రమే తెలిపారు. పశువుల వ్యాధులకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలి.

- అమర్, వెటర్నరీ ఏడీ, మడకశిర

ఆ సందడే వేరు..



- రేపట్నుంచి నామినేషన్ల సమర్పణ
- 25 వరకు ప్రక్రియ
- జిల్లాలో మొదటి సారి..

పుట్టపర్తి, ఏప్రిల్ 16: ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల ప్రక్రియ ప్రత్యేకం. ప్రచారం, పోలింగ్, ఫలితాలు పక్కనపెడితే అసలు మజా నామినేషన్లలోనే ఉంటుంది. భారీ ఎత్తున జనాలు, ర్యాలీలు, డప్పు వాయిద్యాలు ఆ మజాయే వేరు. ఆ నామినేషన్ల ప్రక్రియకు గురువారం తెరలేవనుంది. దీంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కొత్త జిల్లాలో తొలిసారి ఎన్నికలు నిర్వహిస్తుండడంతో అది మరింత ఎక్కువగా ఉంది.

ఏర్పాట్లు పూర్తి

నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. జిల్లాలో ఎంపీ, ఆరు అసెంబ్లీ స్థానాలకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇందులో భాగంగా ఎంపీ స్థానానికి కలెక్టరేట్‌లో నామినేషన్ స్వీకరిస్తారు. అసెంబ్లీ స్థానాలకు సంబంధించి పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, పెనుకొండ, ఆర్డీఓ కార్యాలయాల్లో, హిందూపురం, మడకశిర కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో ఆయా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 26న వాటి పరిశీలన, 29న ఉపసంహరణకు చివరి తేదీ, మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు.

ఏం సెప్తిరి.. ఏం సెప్తిరి..


మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి

ప్రభుత్వంలో కీలకమైన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం గాండ్లపెంటకు వచ్చారు. వైసీపీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. రాజకీయ విమర్శలు చేసుకోకుండా హామీలు గుప్పించారు. ఆ హామీలేంటో తెలుసా..! కదిరి నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థిని గెలిపిస్తే కదిరి-రాయచోటి రోడ్డు వేయిస్తారంట. మండలంలో హంద్రీనీవా కాలువ కూడా తవ్విస్తారంట. కదిరి-రాయచోటి రోడ్డు నిర్మాణ పనులు వైసీపీ అధికారంలోకి వచ్చాకే చేపట్టారు. మూడేళ్లయింది గుంతలు తవ్వి వదిలేశారు. పనులు ముందుకు సాగలేదు. రోడ్డు గుంతల్లో వాహనాలు పడి, చాలామంది గాయాలపాలయ్యారు. పలువురు ప్రాణాలు కూడా కోల్పోయారు. అయినా రోడ్డు పనులు చేపట్టలేదు. మూడేళ్లుగా అలాగే వదిలేశారు. రోడ్డు పూర్తి వేసేందుకు ఎన్నేళ్లు కావాలో.. ఎన్ని ఎన్నికలు రావాలో.. మరి. హంద్రీనీవా కాలువ, కృష్ణాజలాల గురించి పెద్దిరెడ్డి హామీ ఇవ్వడం హాస్యాస్పదమే. తన పలుకుబడితో ఇప్పటికే జిల్లాలోని చెరువులను ఎండబెట్టి హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను చిత్తూరు జిల్లాకు తరలించుకెళ్లారు. కరువు జిల్లాకు తాగునీరు కూడా లేకుండా చేసి పుణ్యం కట్టుకున్నారు. కళ్లెదుటే నీరు తరలించుకుపోతున్నా.. జిల్లా నేతలు చోద్యం చూశారు. కరువు జిల్లావాసి గొంతెండబెట్టి, చేలను బీడుబెట్టి నీటిని తరలించుకుపోయిన పెద్దిరెడ్డి ఈసారి గెలిపిస్తే హంద్రీనీవాకు అనుబంధంగా కొత్తగా కాలువలు తవ్విస్తారట. ఈ మాటలు విని జిల్లా రైతులు మండిపడుతున్నారు. ఇప్పటి వరకు తమకు చేసిన అన్యాయం చాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- గాండ్లపెంట

మూగరోదన..!


పైపులైన్ లీకేజీ నీటితో దాహం తీర్చుకుంటున్న గొర్రెలు

ఎండలు మండిపోతున్నాయి. బయటికెళ్లాలంటేనే భయమేస్తోంది. బయటికెళ్తేనే కడుపు నింపుకుంటాయి గొర్రెలు, మేకలు. కిలోమీటర్లు తిరిగినా ఎక్కడా ఇంత మేత దొరకదు. తీవ్ర వర్షాభావంతో గ్రాసం మచ్చుకు కూడా కనిపించదు. క్షుద్బాధ భరించలేక ఎండిన పోచలను తినాల్సి వస్తోంది. ఎండకు అడవిలో తిరిగే మూగజీవాలు విపరీతమైన దాహంతో విలవిల్లాడుతున్నాయి. ఎక్కడా చుక్కనీరు దొరకట్లేదు. దీంతో గొర్రెలకు నీరు తాపించడం కాపరులకు కష్టతరమవుతోంది. రొద్దం మండలంలోని చోళేమర్రి గ్రామ సమీపాన ఓ వ్యవసాయ బోరు నుంచి లీకేజీ అయిన కాసిన్ని నీటితో దాదాపు వంద గొర్రెలు దాహం తీర్చుకున్నాయి. ఆ నీరు అన్ని గొర్రెలకు సరిపడకపోవడం శోచనీయం.

-రొద్దం


ఫ్యాకల్టీ కోసం నిర్మించిన క్వార్టర్స్


ప్రిన్సిపాల్ భవనం


రెసిడెన్షియల్ స్కూల్...

కపట ప్రేమ!

ముస్లిం మైనార్టీల పట్ల వైసీపీ ఉత్తుత్తి ప్రేమ

- కదిరిలో ప్రారంభానికి నోచుకోని విద్యా భవనాలు
- నిర్లక్ష్యానికి నిదర్శనంగా రెసిడెన్షియల్ స్కూల్, పాలిటెక్నిక్ కళాశాల
- టీడీపీ నిర్మించిందనే ప్రారంభానికి అడ్డు..?




రెసిడెన్షియల్ పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాల భవనాల సముదాయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 16: ముస్లిం మైనార్టీల పట్ల వైసీపీ ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముస్లిం మైనార్టీ జనాభా ఎక్కువగా ఉన్న కదిరి నియోజకవర్గంలో గత టీడీపీ ప్రభుత్వం కేంద్రం సహకారంతో పేద విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ పాఠశాల, పాలిటెక్నికల్ కళాశాలను నిర్మించింది. 2019 ఎన్నికలు రావడం, వైసీపీ అధికారం చేపట్టడంతో ఆ భవనాలు ప్రారంభానికి నోచుకోకుండా పోయాయి. కేవలం టీడీపీకి పేరొస్తుందనే అక్కసుతోనే ఆ పాఠశాల, కళాశాలను వినియోగంలోకి రాకుండా చేసిందన్న విమర్శలు ముస్లిం మైనార్టీ వర్గాల నుంచి వ్యక్తం అవుతున్నాయి.


పాలిటెక్నిక్ కళాశాల భవనం

దాదాపు రూ. 36 కోట్లతో నిర్మాణం...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పీఎంజేవీకే కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కదిరి నియోజకవర్గ కేంద్రంలో 20 ఎకరాల స్థలాన్ని సేకరించాయి. రెసిడెన్షియల్ పాఠశాల కోసం రూ. 18 కోట్లు, పాలిటెక్నికల్ కళాశాల కోసం రూ. 17.78 కోట్లు విడుదల చేశారు. దీంతో రెసిడెన్షియల్ పాఠశాల, పాలిటెక్నికల్ కళాశాల, హాస్టల్, సువిశాలమైన మెస్ హాల్, ప్రిన్సిపాళ్ల భవనాలు, ఫ్యాకల్టీ కోసం ప్రత్యేకంగా క్వార్టర్స్‌తో ఒక మినీ యూనివర్సిటీని తలపించేలా భవన నిర్మాణాలు చేపట్టారు. పాలిటెక్నిక్ కళాశాలకు సంబంధించి చిన్నచిన్న పనులు మినహా అన్నీ పూర్తయ్యాయి. 2019 ఎన్నికలు రావడం ఆ భవనాల ప్రారంభానికి అడ్డు పడినట్లయింది. అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ భవనాలను ప్రారంభించకపోగా వాటిని పలు ప్రభుత్వ శాఖలు వినియోగించుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం. స్థానిక ప్రతిపక్ష నేతలు, ముస్లింమైనార్టీ ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. అప్పటి నుంచి ఆ భవనాలను పట్టించుకోకపోవడంతో ఐదేళ్లుగా నిరుపయోగంగా మారిపోయాయి.

ఐదేళ్లుగా ముస్లిం మైనార్టీల అణచివేత

వైసీపీ ఐదేళ్ల పాలనలో ముస్లిం మైనార్టీలను కోలుకోలేని విధంగా దెబ్బతీశారు. ముస్లింల పక్షపాత ప్రభుత్వమంటూనే ఆవర్గాలను ముంచేసింది. కదిరిలో ముస్లిం మైనార్టీల జనాభాను దృష్టిలో ఉంచుకొని టీడీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో రెసిడెన్షియల్ పాఠశాల, పాలిటెక్నికల్ కళాశాలను నిర్మిస్తే... వాటిని ప్రారంభించకుండా ముస్లిం మైనార్టీ పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసింది. ఎటు చూసినా మైనార్టీలను అణగదొక్కేందుకే వైసీపీ ప్రభుత్వం పాకులాడింది.



సైపుద్దీన్, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

18 ప్రాంతాల్లో వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాలు



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 16: జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో 18 ప్రాంతాల్లో వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తెలిపారు. మే 1 నుంచి 21 వరకు నిర్వహించే కోచింగ్ క్యాంపులకు 8-16 సంవత్సరాల మధ్య వయసుగల క్రీడాకారులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆయా ప్రాంతాల్లో కోచ్‌లను సంప్రదించాలని కోరారు.

ప్రాంతం పేరు	కోచ్ పేరు	ఫోన్ నంబర్
అనంతపురం, పీటీసీ	చంద్రమోహన్‌రెడ్డి	9440243600
అనంతపురం, ఎస్ఎస్‌బీఎన్	షర్మాస్‌వలీ	9177948117
ఆర్డీటీ స్టేడియం	ప్రవీణ్	6305394530
ఆత్మకూరు	అహ్మద్ రఫీ	6281044454
బత్తలపల్లి	భానుప్రకాష్	9177995538
బుక్కరాయసముద్రం	వెంకటేష్	9441489422
ధర్మవరం	రాజశేఖర్	9985929285
గుంతకల్లు రైల్వే	గులామ్‌ఖాదీర్‌బాషా	9885047063
గుంతకల్లు	ఇనయతుల్లా	9701435534
గుత్తి	రాఘవేంద్ర	9398912588
హిందూపురం	సల్మాన్‌ఖాన్	8328182794
కణేకల్లు	గోపాల్‌రెడ్డి	7780136229
కళ్యాణదుర్గం	హరినాథ్‌రెడ్డి	9985344127
కదిరి	నజీర్‌అహ్మద్	9490860339
మడకశిర	నాగేంద్ర	9440566697
నార్పల	మహేశ్వర్	9000032600
పెనుకొండ	ప్రసాద్	8985089910
తాడిపత్రి	జయభార్గవ్	9347640651

యూపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

అధికారులతో సమీక్షలో కలెక్టర్



అనంతపురం టౌన్, ఏప్రిల్ 16: జిల్లాలో జరిగే యూనియన్ పబ్లిక్ సర్వీస్ (యూపీఎస్సీ) కమిషన్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఈ పరీక్షలపై సంబంధిత ఎగ్జామినర్లు, రూట్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు తదితర అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ ఈనెల 21న యూపీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 323 మంది అభ్యర్థులు ఈపరీక్షలకు హాజరవుతున్నారన్నారు. వీరికోసం జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జేఎన్‌టీయూలో ఒకటి, కేఎస్ఎన్ డిగ్రీ మహిళా కాలేజ్‌లో మరొకటి ఏర్పాటు చేశామన్నారు. జేఎన్‌టీయూ మెయిన్‌బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మూడుసెషన్లలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇందులో పేపర్-1 ఇంగ్లిష్ ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు, పేపర్-2 జనరల్‌నాలెడ్జ్ పరీక్ష 12గంటల నుంచి 2గంటలవరకు, పేపర్-3 మ్యాథమేటిక్స్ పరీక్ష మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. కేఎస్ఎన్ పరీక్ష కేంద్రంలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నావెల్ అకాడమీకి సంబంధించి రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఇందులో పేపర్-1 మాథ్‌మేటిక్స్ ఉదయం 10గంటల నుంచి 12-30 గంటల వరకు, పేపర్-2 జనరల్ ఎబిలిటీ టెస్ట్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4-30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని కలెక్టరు తెలిపారు. ఈపరీక్షల కోసం ముగ్గురు పర్యవేక్షకులు, ముగ్గురు రూట్ ఆఫీసర్లను నియమించినట్లు వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని, జిరాక్స్‌సెంటర్లను మూసివేయించాలని ఆదేశించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో శానిటేషన్, తాగునీరు, విద్యుత్, గాలి వెలుతురు వంటి వసతులు ఉండేలా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టరు ఆదేశించారు, కార్యక్రమంలో జడ్పీ సీఈఓ మైఖోమ్ నిదియా, నగర పాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్ఓ రామకృష్ణారెడ్డితో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నామినేషన్ల ప్రక్రియ

కలెక్టరేట్‌లో ఎంపీ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ



అనంతపురం టౌన్/ ధర్మవరం, ఏప్రిల్ 16: ఎన్నికల ప్రక్రియ మరో ఘట్టంలోకి అడుగిడబోతోంది. మార్చి 16న కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ఇచ్చిన విషయం తెలిసిందే. 18న నోటిఫికేషన్‌తోపాటు నామినేషన్ల పర్వం ఆరంభం కానుంది. 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఇప్పటికే ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీలు ఓ దఫా ప్రచారం పూర్తి చేశాయి. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, సీఎం జగన్ జిల్లాలో ఎన్నికల ప్రచార సభలు నిర్వహించారు. పల్లె, పట్నం వీధుల్లో ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాలకు ఆయా కలెక్టరేట్‌లలో నామినేషన్లు స్వీకరిస్తారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఆయా నియోజకవర్గ కేంద్రాలలో నామినేషన్లు స్వీకరణ ఉంటుంది. అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి సంబంధించి ఆర్డీఓ కార్యాలయంలో మిగిలిన వాటికి నియోజకవర్గ కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలో ఎన్నికల ఆర్ఓలు వీరే..

అనంత పార్లమెంటు నియోజకవర్గానికి ఎన్నికల అధికారిగా కలెక్టరు వినోద్‌కుమార్ ఉంటారు. రాయదుర్గం నియోజకవర్గ ఆర్ఓగా కరుణకుమారి, ఉరవకొండకు జేసీ కేతన్‌గార్గ్, గుంతకల్లుకు శ్రీనివాసరెడ్డి, తాడిపత్రికి రాంభూపాల్‌రెడ్డి, శింగనమలకు వెన్నెల శ్రీను, అనంతపురం అర్బన్‌కు ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, కళ్యాణదుర్గంకు ఆర్డీఓ రాణి సుష్మిత, రాప్తాడు నియోజకవర్గంకు వసంతబాబు ఆర్ఓలుగా వ్యవహరిస్తున్నారు. వీరి పర్యవేక్షణలోనే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ కొనసాగనున్నాయి.

శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి..

శ్రీసత్యసాయి జిల్లాకు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ అరుణ్‌బాబు ఉన్నారు. ఎంపీ అభ్యర్థుల నుంచి కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తారు. ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో, పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ భాగ్యరేఖ, కదిరి ఆర్డీఓ కార్యాలయంలో వంశీకృష్ణారెడ్డి, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అపూర్వభరత్ నామినేషన్లు స్వీకరిస్తారు. 21న ఆదివారం సెలవు మినహా మిగిలిన రోజు ల్లో ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు.

శుభముహూర్తం కోసం

నామినేషన్లు దాఖలు చేయడానికి తమ పేరు, జన్మ నక్షత్రం ఆధారంగా శుభ ముహూర్తం కోసం ప్రధాన పార్టీల అభ్యర్థులు జ్యోతిష్యపండితులను సంప్రదిస్తున్నారు. 18, 19 తేదీల్లో తిథి, వార నక్షత్రం, యోగం బలంగా ఉన్నాయని, ఈ రెండు రోజులు శుభప్రదమైనవని జ్యోతిష్య పండితులు చెబుతున్నారు. దీంతో అందుకనుగుణంగా అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఎంటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 16: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంటెక్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. జనవరి, ఫిబ్రవరిలో ఎంటెక్ ప్రథమ, తృతీయ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. తృతీయ, సెమిస్టర్(ఆర్17), ద్వితీయ సెమిస్టర్(ఆర్21,17)తోపాటు ప్రథమ సెమిస్టర్(ఆర్17) సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయన్నారు. డిసెంబర్, జనవరిలో ప్రీపీహెచ్‌డీ వింటర్ సెషన్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఫలితాల కోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

రేపు పల్లె నామినేషన్

పుట్టపర్తి, ఏప్రిల్ 16: తెలుగుదేశం పార్టీ తరఫున గురువారం నామినేషన్లు వేస్తున్నట్లు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మంగళవారం తెలిపారు. తనతోపాటు పల్లె కిశోర్‌రెడ్డి, పల్లె సింధూరారెడ్డి టీడీపీ తరఫున స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్లు వేస్తున్నామని విలేకరులకు వివరించారు. నామినేషన్ కార్యక్రమానికి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

జిల్లా మీదుగా వేసవి ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు, ఏప్రిల్16: వేసవిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జిల్లా మీదుగా ప్రత్యేక రైళ్లను వేసినట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాచిగూడ-కోచువెలి (నెం. 07229) ప్రత్యేక రైలును ఈ నెల 18, 25 తేదీల్లో (గురువారాలు), దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07230)ను ఈ నెల 19, 26 (శుక్రవారాలలో) నడుపుతున్నట్లు తెలిపారు. ఈ రైలు షాద్‌నగర్, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, యర్రగుంట్ల, కడప, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పట్టి, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూరు, పాలక్కడ్, త్రిసూర్, ఎర్నాకులం, చెంగనూరు, కొల్లం స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. అలాగే హౌరా-యశ్వంతపూర్ ప్రత్యేక రైలు (నెం. 02863) ఈనెల 18, 27 తేదీల్లోనూ, తిరుగు ప్రయాణపు రైలు (నెం. 02864) ఈనెల 20, 29 తేదీల్లో నడుస్తుందన్నారు. ఈ రైలు ఖరగ్‌పూర్, బాలాసోర్, భద్రక్, భువనేశ్వర్, ఖుర్ద రోడ్, బ్రహ్మపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్డు, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, దువ్వాడ, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, నంద్యాల, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం స్టేషన్ల మీదుగా నడపనున్నట్లు తెలియజేశారు. అదేవిధంగా హుబ్లీ-గోమతినగర్ (నెం. 07305) ప్రత్యేక వీక్లీ రైల్నుఈ ఈ నెల 13, 20, 27, మే 4, 11, 18 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07305)ను ఈ నెల 16, 23, 30, మే 7, 14, 21 తేదీల్లో నడపనున్నట్లు వివరించారు. ఈ రైలు రాణిబెన్నూర్, హరిహర్, ధావణగెరె, చిగ్జాజుర్, కాడూర్, అరిసికెరె, టుముకూరు, యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, బేగంపేట, సికింద్రాబాద్, ఖాజీపేట, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, బాలార్షా, చంద్రాపూర్, నాగపూర్, బేతుల్, ఘోరడోంగ్రి, ఇటార్సి, భోపాల్, లలిత్‌పూర్, కాన్పూర్ సెంట్రల్, ఐష్‌బాగ్, బాద్షానగర్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

22 నుంచి టీసీసీ పరీక్షలు

అనంతపురం విద్య/ కొత్తచెరువు, ఏప్రిల్ 16: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) 2024లో డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో లోయర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఈనెల 22 నుంచి 25 వరకూ నిర్వహించనున్నట్లు డీఈఓలు వరలక్ష్మి, మీనాక్షి మంగళవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల హాల్‌టికెట్లు www.bse.ap.gov.inలో అందుబాటులో ఉన్నాయని, డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలన్నారు. హాల్‌టికెట్‌తోపాటు ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఆధార్ కార్డు, పాన్‌కార్డు లేదా డ్రైవింగ్ లైసెన్సుతో పరీక్ష కేంద్రాలకు రావాలని సూచించారు. డైట్‌కు సంబంధించి 22నుంచి 27వరకు పరీక్షలు జరుగుతాయని శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ మీనాక్షి తెలిపారు.

డీఈఓ కార్యాలయంలో టీటీసీ-2023 సర్టిఫికెట్లు

అనంతపురం విద్య, ఏప్రిల్ 16: గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు- 2023 పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారి సర్టిఫికెట్లు డీఈఓ ఆఫీస్‌కు వచ్చాయని డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్‌నాయక్ మంగళవారం తెలిపారు. డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్‌లో టీటీసీ సర్టిఫికెట్ల కోసం పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన అభ్యర్థులు కమలానగర్‌లోని డీఈఓ ఆఫీస్‌లో రావాలని సూచించారు. టీటీసీ-2023 పరీక్షల హాల్ టికెట్లు, వారి ఫలితాల కాపీతోపాటు ఆధార్ కార్డును తీసుకుని డీఈఓ ఆఫీస్‌లో కలవాలని సూచించారు.

చీనీకాయలు టన్ను రూ.37 వేలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 16: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో చీనీకాయలు మంగళవారం టన్ను గరిష్ఠంగా రూ.37 వేలు, కనిష్ఠంగా రూ.20 వేలు, సరాసరి రూ.26 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు 752 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

గొంతులో ఇరుక్కున్న ఎముక వృద్ధుడికి అస్వస్థత

గోరంట్ల, ఏప్రిల్ 16: మండలంలోని కరావులపల్లికి చెందిన వృద్ధుడు పూజారి వెంకటరామప్ప గొంతులో ఎముక ఇరుక్కోవడంతో మంగళవారం అస్వస్థతకు గురయ్యాడు. మాంసాహారం భుజిస్తుండగా ఎముక గొంతులో అడ్డుపడినట్లు బంధువులు తెలిపారు. వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వీలుకాకపోవడంతో మెరుగైన వైద్యం కోసం హిందూపురం తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు.

కారు డ్రైవర్ దారుణహత్య


శ్రీనివాసరెడ్డి(ఫైల్)

ధర్మవరం, ఏప్రిల్ 16: పట్టణంలోని కొత్తపేట రైల్వేస్టేషన్ సమీపంలో ఓ కారు డ్రైవర్ మంగళవారం తెల్లవారుజామున దారుణహత్యకు గురయ్యాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు..పట్టణంలోని తారకరామాపురానికి చెందిన శ్రీనివాసరెడ్డి(55) కారు డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇతను అందరితో బాగా కలిసిపోయేవాడు. ఈనెల 14న మదనపల్లిలో ఉన్న కుమారుడి వద్దకు వెళ్లాడు. 15న రాత్రి మదనపల్లి నుంచి రైలులో బయలుదేరి మంగళవారం తెల్లవారుజామున ధర్మవరం చేరుకున్నాడు. అయితే అంకాలమ్మగుడి వద్ద శ్రీనివాసరెడ్డిని బండరాయితో మోది చంపారు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబసభ్యులు, టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమేరాల ఫుటేజీ ఆధారంగా లోకేంద్ర, విష్ణువర్ధన్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతుడికి భార్య శారదమ్మ, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇందులో జయ కృష్ణారెడ్డి, గంగాధర్‌రెడ్డి మదనపల్లిలో ఉంటు న్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

కిరాయి విషయంలోనే హత్య

కారు డ్రైవర్ శ్రీనివాసరెడ్డి హత్యకేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టగా తారకరామాపురం వద్ద ఉన్న లోకేంద్ర, విష్ణువర్ధన్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఆటో కిరాయి విషయంలో జరిగిన గొడవే హత్యకు దారి తీసినట్లు సీఐ తెలిపారు.

రేపు ఉరవకొండకు షర్మిల రాక

ఉరవకొండ, ఏప్రిల్ 16: న్యాయయాత్రలో భాగంగా పీసీసీ అధ్యక్షురాలు షర్మిల గురువారం ఉరవకొండకు రానున్నట్లు కాంగ్రెస్ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పాత బస్టాండ్ వద్ద సాయంత్రం బహిరంగ సభలో ఆమె ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

ఉమ్మడి జిల్లాలో వలంటీర్ల రాజీనామాలపర్వం కొనసాగుతోంది. వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం కోసమే వలంటీర్లు ఇలా బరితెగించి రాజీనామా చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే ఎన్ని నిబంధలు పెట్టిన కొంతమంది యానిమేటర్లు, ఉపాధి సిబ్బంది వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే ఉన్నారు.


రాజీనామా పత్రాన్ని చూపుతున్న వలంటీర్లు (రొళ్ల)

గుత్తిరూరల్, ఏప్రిల్ 16: మండలంలోని శ్రీపురం (కోజ్జేపల్లి) గ్రామంలో ఆరుగురు గ్రామ, వార్డు వలంటీర్ల రాజీనామా చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసులుకి రాజీనామా పత్రలను అందజేశారు.

గోరంట్ల: మండలంలోని వడిగేపల్లి పంచాయతీలో 15మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని టీ వీరాపురం గ్రామానికి చెందిన ఐదుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అల్లాబకాష్‌కు రాజీనామా పత్రాన్ని అందించారు.

రొళ్ల: మండలంలోని వివిధ పంచాయతీ గ్రామాల్లో పనిచేస్తున్న వలంటీర్లు రాజీనామా చేశారు. మంగళవారం రొళ్ల 1, 2 పంచాయతీలకు చెందిన వలంటీర్లు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని ఎంపీడీఓ ప్రసాద్‌కు రాజీనామా పత్రాన్ని అందజేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● ఎన్నికల ప్రచారంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కందికుంట, బీకే

తనకల్లు, ఏప్రిల్ 16: చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధి పేర్కొన్నారు. మండలంలోని రాచినేపల్లి గ్రామ పంచాయతీలోని గ్రామాల్లో మంగళవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లోకి రాగానే వారికి స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. వారు ప్రతి ఇంటికి తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కూటమి అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి పనులను వివరించారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదన్నారు. పైపెచ్చు అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాలతో పాలన సాగించిందన్నారు. ప్రస్తుతం సీఎం జగన్ గులకరాయితో సానుభూతి పొందాలని చూస్తున్నట్లు దుయ్యబట్టారు. ఆయన నాటకాలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ రెడ్డిశేఖర్ రెడ్డి, మాజీ కన్వీనర్లు శంకర్‌నాయుడు, రాజారెడ్డి, మాజీ సర్పంచ్ గంగప్పనాయుడు, మాజీ ఎంపీటీసీ నాగప్ప, మాజీ జడ్పీటీసీ రవీంద్రారెడ్డి, నాయకులు సిద్దప్పనాయుడు, మొండెం వెంకటరెడ్డి, రాజారెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రాచినేపల్లిలో ప్రచారం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

టీడీపీలోకి చేరికలు

రాచినేపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధి ఆధ్వర్యంలో పలువురు స్థానికులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సుమారు 20కుటుంబాల వారు పార్టీలో చేరారు. వారికి కందికుంట, బీకే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో గంగాద్రినాయుడు, మల్లికార్జునాయుడు, సాంబనాయుడు, నాగేశ్వరమ్మ, సురేంద్రనాయుడు, కిష్టప్పనాయుడు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు గంగప్పనాయుడు, సిద్ధానాయుడు, మల్లికార్జున నాయుడు తదితరులు ఉన్నారు.


టీడీపీలో చేరినవారితో కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు

నేడు సీతారాముల కల్యాణం

ముదిగుబ్బ, ఏప్రిల్ 16: మండల కేంద్రంలోని పాతవూరులో గల సూర్య చంద్ర అభయ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో, గ్రామ ప్రజల సహకారంతో సీతారాముల కల్యాణం మహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. భక్తాదులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. ఉదయం సీతమ్మ వారి మంగళసూత్రం ఊరేగింపులో మహిళలు పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

తాగునీటి ఎద్దడి రానివ్వకండి

పుట్టపర్తి, ఏప్రిల్ 16: వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్సులో కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ ఈ మల్లకార్జున, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ పాల్గొన్నారు. తాగునీటితో పాటు విద్యుత్‌సరఫరా, ఉపాధిహామిపై సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టరు జిల్లాలో చేపట్టిన పనులను వివరించారు. 153 గ్రామాల్లో 415 ట్యాంకర్లతో తాగునీటి అవసరాలు తీర్చుతున్నామన్నారు. ఉపాధిహామీ కూలీలకు పనిచేసే ప్రదేశాల్లో నీడ, తాగునీటి సౌకర్యాలను కల్పించామని తెలిపారు.

గ్రామాల్లో పల్లె సింధూర ముమ్మర ప్రచారం

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 16: మండలంలోని తిప్పేపల్లి పంచాయతీలో గల తిప్పేపల్లి, ఎస్సీకాలనీ, జెరికుంటపల్లి, ఉట్లవారిపల్లి గ్రామాల్లో మంగళవారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి, యువనాయకుడు పల్లె వెంకటకృష్ణకిశోర్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరుగుతూ ప్రజల్ని ఆప్యాయంగా పలకరించారు. వచ్చే ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని కోరారు. చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. వైసీపీని ఇంటికి సాగనంపాలని అన్నారు. పూర్తిగా మద్య పానం నిషేధం చేసిన తర్వాతనే ఎన్నికల్లో ఓట్లు అడుగుతామని చెప్పిన సీఎం జగన్‌రెడ్డి ఇప్పుడు ఎలా ప్రజల్లోకి వస్తున్నారని ప్రశ్నించారు. చెప్పిన మాట తప్పిన సీఎం అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, మైనార్టీ నాయకులు మండోజీ ఆర్బీఖాన్, చికెన్ షానూ, పొగాకు షాన్వాజ్,ఇర్షాద్, ఆర్‌ఎంపీ జాకీర్, మాజీ కన్వీనర్ రాజారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


తిప్పేపల్లిలో ప్రచారం చేస్తున్న పల్లె సింధూర

టీడీపీలోకి భారీగా చేరికలు..

నల్లమాడ: మండలంలోని పెమన కుంట పల్లి గ్రామంలో వైసీపీ ముఖ్యనాయకుడు మంజునాథరెడ్డి తో పాటు 106 కుటుంబాల వారు ఆ పార్టీని వీడి టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా సమావేశం ఏర్పాటు చేయగా మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి హాజరై మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావన్నారు. ఆ అరాచకపాలనతో ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. ప్రజలు వైసీపీని చిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబా బు సీఎం అయితేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. తర్వా త టీడీపీలోకి చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. చేరినవారిలో గోపేపల్లి ఉత్తమరెడ్డి, శంకర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, శ్రీకర్‌రెడ్డి, లక్ష్మీదేవి, నరేష్‌కుమార్‌రెడ్డి, నవ్య, ప్రభావతి, పెద్ద కాంతమ్మ, పద్మావతి, వానమ్మ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, నాయకులు వెంకటరమణనాయుడు, బుట్టినాగభూషణ నాయుడు, సలాంఖాన్, ప్రసాద్‌రెడ్డి, కులశేఖర్‌నాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, పుట్టపర్తి కౌన్సిలర్‌లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

కొత్తచెరువు: మండల కేంద్రంలో బోయ, ముస్లిం కమ్యూనిటీకి చెందిన 5 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. మాజీ మంత్రి పల్లె వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ అడపాల రామకృష్ణ, నాయకులు కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, బండ్లపల్లి రాజు, సుబ్బరాయుడు, శీన పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: మండలంలోని బుగ్గపల్లిలో 5కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో వైసీపీలీగల్ అడ్వైజర్ సుభాష్, బాలాజీనాయక్, సురేష్‌నాయక్, అమర్నాథ్‌చౌదరి, గుర్రం రవిచంద్రనాయుడు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌కుమార్, జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి అబ్దుల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పెమనకుంటపల్లిలో టీడీపీలో చేరినవారితో మాజీమంత్రి పల్లె

పాలిటెక్నిక్ కోర్సులతో ఉపాధి

కదిరిఅర్బన్, ఏప్రిల్ 16: పాలిటెక్నిక్ కోర్సులతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ ప్రిన్సిపాల్ నారాయణ పేర్కొన్నారు. కళాశాలలోమంగళవారం జాబ్ ఆపర్చునీస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో పాలిటెక్నిక్ మూడో సంవత్సరం చదువుతున్న 56మంది విద్యార్థుల్లో 54మందికి ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. కొలువుల్లో త్వరగా స్థిరపడాలన్నా, ఇంజనీర్లుగా ఎదగాలన్నా పాలిటెక్నిక్ కోర్సులకు మించిన ప్రత్యామ్నాయం మరొకటి లేదన్నారు. ఉపాధి పొందిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏడీఏ సత్యనారాయణ, అధ్యాకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే చర్యలు

బుక్కపట్నం, ఏప్రిల్ 16: ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా అసాంఘి క కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ సురేష్‌బాబు హెచ్చరించారు. మండలంలోని సిద్దరామపురం, లింగప్పగారిపల్లి గ్రామాల్లో మంగళవారం రాత్రి ఆయన సిబ్బందితో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడుతూ ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఏఎస్‌ఐ రమణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సదరంలో మార్పులు

కదిరిఅర్బన్, ఏప్రిల్ 16: కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల18వ తేదీన నిర్వహించాల్సిన కళ్లకు సంబంధించిన సదరం క్యాంపును 22వ తేదీన చేపట్టనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. మిగిలిన సదరమ్ క్యాంపులు యథావిధిగా జరుగుతాయని అన్నారు.

విద్యాసంస్థల ఫ్లెక్సీలను తొలగించాలని వినతి

కదిరిఅర్బన్, ఏప్రిల్ 16: పట్టణంలో పలు ప్రైవేటు విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాయని, వెంటనే వాటిని తొలగించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. పలువురు మాట్లాడుతూ విద్యాసంవత్సరం పూర్తికాకనే పలు ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్మిషన్లకోసం ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాయన్నారు. వెంటనే వాటిని తొలగించి ఆ యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాబ్‌జాన్, పవన్‌కుమార్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'న్యాయం గెలిచింది'

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 16: దళితుల శిరో ముండనం కేసులో దశాబ్దాల తరువాత వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు శిక్ష వేయడంపై మండలంలోని ఎస్సీ సెల్ నాయకులు న్యాయం గెలిచిందంటూ హర్షం వ్యక్తం చేశారు. మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామచంద్రాపురం మండలం వెంకటయ్యపాళ్యానికి చెందిన ఐదుగురు దళితులను హింసించి, శిరోముండనం చేసిన ఘటన 1996లో జరిగిందన్నారు. ఈకేసులో నిందితులుగా ఉన్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులతో పాటు మరో పదిమందికి విశాఖ కోర్టు 18నెలల జైలు శిక్ష, రూ.2.50 లక్షల జరిమానా విధించిం దన్నారు. ఇది ఎంతో హర్షణీయమన్నారు. సమావేశంలో ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడిశం రామాంజి, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

దళిత మోర్చా మండల అధ్యక్షుడిగా శ్రీరాములు

తాడిమర్రి, ఏప్రిల్ 16: దళిత మోర్చా మండల అధ్యక్షుడిగా శ్రీరాములు నియమితులయ్యారు. మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్, ధర్మవరం అసెంబ్లీ కన్వీనర్ గంగులకుంట గోపాల్‌రెడ్డి తనను నియమించినట్లు శ్రీరాములు మంగళవారం తెలిపారు. మండలంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

కాలిపోయిన విద్యుత్ కేబుల్

కొత్తచెరువు, ఏప్రిల్ 16: కొత్తచెరువు మండలానికి పుట్టపర్తి నుంచి విద్యుత్‌ను సరఫరా చేసే 33 కేవీ కేబుల్‌వైరు కాలిపోవడంతో మండలానికి మంగళవారం విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. కొద్దిసేపటికి ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ కేబుల్ మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించారు. దీంతో ప్రజలకు ఉపశమనం కలిగింది.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలి

● ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి ఆదేశం

ధర్మవరం, ఏప్రిల్ 16: ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో కేటాయించిన విధులను ఎంతో బాధ్యతగా నిర్వర్తించాలని ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి ఆదేశించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ సమావేశపు భవనంలో మంగళవారం ఆయన సెక్టార్, రూట్ ఆఫీసర్లకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా చూడాలన్నారు. ఈవీఎం, వీవీప్యాట్‌ల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి

సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం

ధర్మవరం, ఏప్రిల్ 16: పట్టణంలో టీడీపీ 25వ వార్డు ఇన్‌చార్జి భీమనేని ప్రసాద్‌నాయుడు మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ఆ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు కరపత్రాలు పంచుతూ వివరించారు. చంద్రబాబు సీఎం కాగానే వాటిని అమలు చేస్తారని తెలిపారు. ధర్మవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా సత్యకుమార్‌యాదవ్‌ను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం: మండలంలోని మారాల, కృష్ణాపురం పంచాయతీలోని గ్రామాల్లో టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షరాలు సాకేయ శోదరాయుడు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ తిరిగి ప్రజలకు కరపత్రాలు పంచుతూ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. చంద్రబాబు సీఎం కాగానే పథకాలు అమలవుతాయని తెలిపారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరను, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధిని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు పెద్దన్న, నాయకులు నరసింహులు, మల్లికార్జున, అశోక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీతో పాటు ఇనగలూరు గ్రామంలో మంగళవారం టీడీపీ ఎస్సీసెల్ నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి ప్రజలకు కరపత్రాలు పంచుతూ పథకాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారని తెలిపారు. ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడిశం రామాంజనేయులు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గంగాద్రి, మాజీ సర్పంచ్ నరసింహులు, నాయకులు శ్రీనివాసులు, కిష్ట తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ధర్మవరం, ఏప్రిల్ 16: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని మాంగళ్య షాపింగ్‌వాల్‌లో మంగళవారం అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక కేంద్రం అధికారి ఎం.రాజు ఆధ్వర్యంలో సిబ్బంది అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని ఏ విధంగా నియంత్రించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రమాదాలు జరగకుండా ఏమి చర్యలు చేపట్టాలి అనే వాటిపై షాపింగ్ మాల్లో సిబ్బందికి అవగాహన కల్పించారు. అర్థవంతమైన రీతిలో ప్రయోగాత్మకంగా అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.


అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కూటమి విజయానికి కృషి

ధర్మవరం, ఏప్రిల్ 16: కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని పట్టణంలోని జనసేన నాయకుడు అరిగెలభాస్కర్ తెలిపారు. పట్టణంలోని సిద్దార్థ థియేటర్ నిర్వాహకులైన ఆయన నాలుగు రోజుల క్రితం పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఇందుకు గాను స్థానిక ఆ పార్టీ నాయకులు మంగళవారం ఆయన్ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భం మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలలో కూటమి విజయానికి శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు కావేటి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బత్తలపల్లి, ఏప్రిల్16: మండలకేంద్రం సమీపంలో సోమవారం రాత్రి ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని డీ చెర్లోపల్లి గ్రామానికి చెందిన జయప్ప (50) ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే సోమవారం రాత్రి బత్తలపల్లికి ఆటోలో వచ్చి పని అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. బైపాస్ రోడ్డు సమీపంలో కి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికులు అతడిని స్థానిక ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్యలక్ష్మీదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో బాలుడికి తీవ్ర గాయాలు

ముదిగుబ్బ, ఏప్రిల్ 16: మండలంలోని మలకవేముల క్రాస్‌లో విద్యుదాఘాతంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కదిరి మండలం రాచువారిపల్లి తండాకు చెందిన రామాంజి నాయక్ బతుకుదెరువు కోసం కుటుంబంతో వలసవచ్చి మలకవేముల క్రాస్‌లో నివాసముంటున్నాడు. అయితే మంగళవారం అతడి కుమారుడు భువనేష్ నాయక్ మిద్దెపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలకు తగిలాడు. దీంతో షాక్ తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హుటాహుటిన కదిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. తర్వాత అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

కటారుపల్లిలో ఘనంగా ఉట్ల తిరునాళ్ల

గాండ్లపెంట, ఏప్రిల్ 16: మండలంలోని కటారుపల్లిలో యోగివేమన బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మూడోరోజు ఉట్ల తిరుణాళ్లను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు తొలుత వేమన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేమన సమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి సమాధిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. తర్వాత నిర్వాహకులు 25 అడుగుల ఇనుము పైపునకు గ్రీసు, నూనె తదితర జారుడు పదార్థాలను పూసి చివరన ఉట్టిని కట్టి నిలబెట్టారు. దీన్ని ఎక్కడానికి యువత ఉత్సాహంగా పోటీపడ్డారు. ఈసంబరం ప్రజలను ఎంతో ఆకట్టుకుంది. ఉట్టిమాను ఎక్కి చివర ఉన్న ఉట్టిని తీసుకుని రావడంతో ఉట్ల తిరుణాళ్ల ముగిసింది. తిరునాళ్ల సందర్భంగా అక్కడ ఆటవస్తువులు, గాజులు, తినుబండారాలు తదితర దుకాణాలు భారీగా వెలిశాయి. అవన్నీ భక్తులతో కిటకిటలాడాయి.


ప్రత్యేకాలంకరణలో వేమన సమాధి

చీనీరైతులను ఆదుకుంటాం

● ఎన్నికల ప్రచారంలో కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్

తాడిమర్రి, ఏప్రిల్ 16: కష్టాల్లో ఉన్న చీనీ రైతులను ఆదుకుంటామని నియోజకవర్గ కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని రామాపురం, కునుకుంట్ల, మద్దులచెరువు, మేడిమాకుల పల్లి, ఆత్మకూరు, శివంపల్లి, అగ్రహారం, మర్రిమాకులపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కునుకుంట్ల గ్రామం వద్ద చీనీరైతుల వద్దకు వెళ్లి వారి ఇబ్బందుల గురించి ఆరా తీశారు. పంటలకు సరిపడా నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, భూగర్భజలాలుపూర్తిగా అడుగుంటడంతో ఈ పరిస్థితి తలెత్తిందని కొందరు రైతులు వాపోయారు. దీనికి తోడు నాణ్యమైన పురుగుల మందులు లభించక చీనీచెట్లకు ఎక్కువ సార్లు మందులు కొట్టి నష్టాల పాలవుతున్నామన్నారు. ఇందుకు స్పందించిన సత్యకుమార్ కూటమి అధికారంలోకి రాగానే చీనీపంటకు గిట్టుబాటు ధర కలిస్తామన్నారు. అలాగే నాణ్యమైన మందులను పంపిణీ చేసేలా చర్యలుచేపడుతున్నామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇంటింటా తిరిగి కూటమి అధికారంలోకి చేపట్టే అభివృద్ధి పనులను వివరించారు. కూటమి విజయానికి ప్రతిజ్ఞకృరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్, మండల కన్వీనర్ కూచిరామ్మోహన్, నాయకులు వెంకటేశ్, జనార్దన్ పతకమూరి, ఎల్ నరేంద్రచౌదరి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, రఘురాంచౌదరి,హర్ష, శ్రీనివాసులు, ఎల్లప్ప, పక్కీర్‌రెడ్డి పాల్గొన్నారు.


చీనీతోటను పరిశీలిస్తున్న సత్యకుమార్‌యాదవ్

ముంపు బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తాం: బీకే

చిత్రావతి రిజర్వాయర్ ముంపు బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని కూటమి ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ పేర్కొన్నారు. మండలంలోని మర్రిమాకులపల్లి గ్రామంలో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారికి టీడీపీ జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి జనార్దన్‌పతకమూరి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు తమ గ్రామంలో ఇంకా 124మందికి ముంపు పరిహారం అందలేదని తెలిపారు. ఇందుకు వారు మాట్లాడుతూ ముంపు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో పాటు పూర్తిస్థాయిలో పరిహారం అందించేలా చేస్తామన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన నెలరోజుల్లోపే సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సోమశేఖర్‌నాయుడు, రామానాయుడు, ధర్మనాయుడు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.


మర్రిమాకులపల్లిలో అభ్యర్థులను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

ఎన్నికల ప్రచారంలో యానిమేటర్లు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 16: ఎన్నికల నిబంధనల మేరకు ఉద్యోగులెవరైనా రాజకీయ ప్రచారాలు, సమావేశాల్లో పాల్గొనరాదని ఆదేశాలున్నాయి. అయితే వాటిని తుంగలో తొ క్కి, మేము మారం, మాకేంటి భయం అనే చందంగా ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం జిల్లాకేంద్రంలోని బ్రాహ్మణపల్లిలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి అప ర్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో యానిమేటర్లు ఎల్ అరుణమ్మ, ఎంలక్ష్మీదేవి పాల్గొన్నారు. వైసీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వైసీపీకి ఓటు వేయాలంటూ ప్రచారం నిర్వహించారు.


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న యానిమేటర్లు అరుణమ్మ, లక్ష్మీదేవి

ఎన్నికల ప్రచారంపై టీడీపీ సమావేశం

నల్లచెరువు, ఏప్రిల్ 16: మండలకేంద్రంలోని బషీర్ ఇండస్ట్రీస్‌లో ఎన్నికల ప్రచారంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ 18వ తేదీ నుంచి మండలంలోని పి.కొత్తపల్లి, బాలేపల్లితండా, అల్లుగుండు, ఎస్. మొకలపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ ప్రచారానికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ హాజరవుతారన్నారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటా తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. అలాగే టీడీపీ అధికారంలోకి వస్తే కలిగే ప్రయోజనాల గురించి తెలియజేయాలని చెప్పారు. ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మాబూసాబ్, నాయకులు దాదెం శివారెడ్డి, బషీర్ అహమ్మద్, నాగభూషణంనాయుడు, వెంకటరమణ, జయరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామమోహన్, రమణారెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు టీడీపీతోనే న్యాయం

● నందమూరి వసుంధరాదేవి
● చిలమత్తూరులో ముగిసిన నాలుగు రోజుల రోడ్ షో


చేనేపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న వసుంధరాదేవి

చిలమత్తూరు, ఏప్రిల్ 16: అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరా దేవి పేర్కొన్నారు. మండలంలో నాలుగు రోజులుగా చేపట్టిన ఎన్నికల రోడ్ షోలో భాగంగా ఆమె మంగళవారం చిలమత్తూరు, టేకులోడు, దేమకేతేపల్లి పంచాయతీల్లో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పుడున్న ప్రభుత్వం మాటకు మాత్రమే నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అని అం టోందని, వారికి ఏ మాత్రం న్యాయం చేయలేదన్నారు. గత టీడీపీ హ యాంలోనే బడుగుబలహీన వర్గాలకు న్యాయం జరిగిందనిన్నారు. హిందూపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం మరోసారి ఎమ్మెల్యేగా బాలకృష్ణను, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథిని గెలిపించాలన్నారు. చిలమత్తూరులో ఆమె రాకకోసం వందలాది మంది మహిళలు, వృద్ధులు వేచి చూశారు. ముస్లిం మైనార్టీలు ప్రచార రథం వద్ద ప్రార్థనలు జరిపారు. చేనేపల్లిలో రోడ్‌షో చేస్తూ అక్కడున్న సుబ్రమణ్యేశ్వర ఆలయంలో పూజలు చేశారు. ఆ గ్రామస్థులతో సమస్యలు అడిగితెలుసుకున్నారు. టేకులోడు, దేమకేతేపల్లి పంచాయతీల్లో చీకటి పడినా రోడ్‌షో సాగింది. వసుంధర దేవిని చూడటానికి ప్రజలు వేచి చూశారు. అలాగే తుమ్మలకుంట గ్రామంలో ఆమె ప్రచారం రథం దిగి చింత పండు కొడుతున్న మహి ళలతో మాట్లాడారు. ఆమె స్వయంగా చింతపండు కొట్టారు. ఆమె వెంట లోకేశ్వరి, శ్రీనివాసు, ఐటీ ప్రొఫెషనల్ వింగ్ ప్రతినిధి తేజశ్విని, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డాక్టర్ సురేంద్ర, జెడ్పీటీసీ అనూష, రావిళ్ల లక్ష్మి, పరిమళ, అనిల్, దేమకేతేపల్లి అంజనప్ప, రంగారెడ్డి, తిప్పారెడ్డి, బేకరీ గంగాధర్, చౌడప్ప, నాగరాజు స్వామి తదితరలు పాల్గొన్నారు.

బాలయ్య గెలుపుకోసం ఉజ్జయినికి పంచమ జ్యోతులు

హిందూపురం అర్బన్: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణ సార్వత్రిక ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలవాలని ముద్దిరెడ్డిపల్లి వాసులు వేయి మంది ఉజ్జయిని మహాంకాళి అమ్మవారిని దర్శించి పంచమజ్యోతులు సమర్పించనున్నట్లు బండారు బాలాజీ తెలిపారు. స్థానిక ముద్దిరెడ్డిపల్లికి చెందిన చౌడేశ్వరీ ఆలయ ధర్మకర్త బండారు బాలాజీ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌లోని ఉజ్జ యినీ కాళీ మాత ఆలయానికి మంగళవారం తరలివెళ్లారు. అక్కడ అన్నదానం చేస్తామని వారు తెలిపారు.



ఉజ్జయిని మహాంకాళి దర్శనం కోసం వెళ్తున్న ముద్దిరెడ్డిపల్లివాసులు

శ్రీరామనవమికి ముస్తాబైన ఆలయాలు


ముస్తాబైన మిట్ట ఆంజనేయస్వామి ఆలయం

పెనుకొండ, ఏప్రిల్ 16 : పట్టణంలో ప్రసిద్ధిచెందిన రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాలు శ్రీరామనవమి వేడుకలకు సర్వాంగసుందరంగా ముస్తాబ య్యాయి. ప్రసిద్ధిచెందిన రాయలకాలంనాటి శ్రీరామభద్రాలయం, బోయపాళ్యంలోని పురా తన రామాలయం, మిట్ట అంజనేయస్వామి ఆలయాలను విద్యుత్ దీపాలు, పచ్చని తోరణాలతో అలంకరించారు. పండగ రోజు బుధవారం ఉదయం ఆలయాల్లో అభిషేకాల తో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. భక్తులకు వడపప్పు, పానకం ప్రసాదం పంపి ణీతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయా ఆలయాల కమిటీ వారు తెలిపారు. భక్తులందరూ హాజరై స్వామికృపకు పాత్రులు కావాలని కోరారు.


ఆలయ ప్రాంగణంలోని 50అడుగుల శ్రీరాముడి విగ్రహం

తుమ్మలమారెమ్మకు ప్రత్యేక పూజలు

గుడిబండ, ఏప్రిల్ 16: మండల కేంద్రంలో వెలసిన తుమ్మలమారెమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మంగళవారం ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనేకమంది భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

గ్రంథాలయం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమాదేవి

గుడిబండ, ఏప్రిల్ 16: మండలకేంద్రంలోని గ్రంథాలయ కార్యాలయాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమాదేవి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. అనంతరం గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. వేసవి సందర్భంగా పాఠకులు, విద్యార్థులకు ఉపయోపడే పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కమలనాభరావు ఉన్నారు.

రేపు నోటి క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 16: ప్రపంచ నోటి ఆరోగ్యమాసోత్సవాలను పురస్కరించుకొని స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రిలో గురువారం నోటి క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ లింగన్న సోమవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు తదితర వాటి వల్ల నోటి క్యాన్సర్ అధికంగా వ్యాప్తి చెందుతోందన్నారు. నోటిలో పుండ్లు, చిగుళ్ల వాపు, గొంతు బొంగుర పోవడం, నమలడం, మింగడం కష్టం కావడం, నోటిలో ఎర్రని మచ్చలు రావడం తదితర లక్షణాలు వ్యాధికి సూచకాలన్నారు. ఇంతకు ముందు బయాప్సి ద్వారా ల్యాబ్‌కు పంపి వ్యాధి నిర్ధారించే వారని ప్రస్తుతం వెల్‌స్కోప్ అను సరికొత్త పరికరం ద్వారా వెంటనే వ్యాధి నిర్ధారణ చేయవచ్చన్నారు. ప్రభుత్వాసుపత్రిలోని 11వ నంబర్ గదిలో డాక్టర్ భూపాలం విజయ్‌బాబు, డాక్టర్ అయేషా నిర్ధారణ పరీక్షలు చేస్తారని తెలిపారు. ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు కురుబల ఆత్మీయ సమావేశం

పెనుకొండ, ఏప్రిల్ 16 : పట్టణంలోని మడకశిర రోడ్డులో ఉన్న టీడీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ స్థాయి కురుబల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు కురుబ సంఘం నాయకులు తెలిపారు. కురుబ సంఘం నాయకులు శ్రీనివాసులు, రామాంజనేయులు, రామక్రిష్ణ, వెంకటరాముడు తదితరులు మంగళవారం టీడీపీ స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.... బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కోసం టీడీపీ ఎంతో కృషిచేస్తోందన్నారు. బీసీలకు రాజకీయ గుర్తింపు టీడీపీ ద్వారానే లభించిందన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కురుబ సామాజికవర్గానికి చెందిన సవితకు పెనుకొండ ఎమ్మెల్యే టికెట్, హిందూపురం పార్లమెంట్ అభ్యర్థిగా అదే సామాజిక వర్గానికి చెందిన బీకే పార్థసారథికి టికెట్ కేటాయించడం హర్షణీయమన్నారు. వారిని పెద్దఎత్తున అభినందించడానికి ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 1గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి నియోజకవర్గంలోని కురుబలందరూ పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గోరంట్ల, ఏప్రిల్ 16: మండలంలోని బూదిలి గ్రామసచివాలయం వద్ద మంగళవారం ద్విచక్రవాహనాన్ని జీపు ఢీకొని తిప్పన్న అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బూడిదగడ్డపల్లికి చెందిన ఆదెన్న కుమారుడు తిప్పన్న వరిపంట కోత యంత్రం కోసం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బూదిలి గ్రామం వద్ద ప్రమాదానికి గురయ్యాడు. గోరంట్లవైపు వెళ్తున్న జీపు ఎదురుగా వస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. తిప్పన్న తలకు బలమైన గాయం కావడంతోపాటు కుడికాలు విరిగి, తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం 108 లో హిందూపురం, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

షర్మిల పర్యటనను విజయవంతం చేయండి

మడకశిర టౌన్, ఏప్రిల్ 16: ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గురువారం మడకశిర నియోజకవర్గంలో పర్యటిస్తున్నారని, విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మడకశిర అభ్యర్థి కే సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఆమె ఉదయం 9గంటలకు మడకశిరకు చేరుకొంటారని అన్నారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా పర్యటించనున్నారు. పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ నందు బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, పలువురు జిల్లా నేతలు హాజరు కానున్నట్లు తెలిపారు.

అగళి : మడకశిరలో జరిగే గురువారం జరిగే ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల బహిరంగ సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ లోకేష్ జిల్లా ఉపాధ్యక్షులు రాజ్‌కుమార్ తెలిపారు. మండలం నుంచి వేలాది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలనికోరారు.

టీడీపీతోనే ఉపాధి అవకాశాలు

కూటమి అభ్యర్థులు బీకే, సవిత


మలసముద్రం ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థులు పార్థసారథి, సవిత

గోరంట్ల, ఏప్రిల్ 16: రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. వారు మంగళవారం మండలంలోని మలసముద్రం పంచాయతీ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికెళ్లి కరపత్రాలు పంచి, సూపర్ సిక్స్‌పథకాల గురించి వివరించారు. చంద్రబాబు కృషి వల్లనే జిల్లాకు కియ, నాసిన్, బెల్, నిషా గార్మెంట్స్ పరిశ్రమలు వచ్చాయన్నారు. వాటికి అనుబంధంగా అనేక పరిశ్రమలు రావడానికి సిద్ధంగా ఉండగా వైసీపీ ప్రభుత్వం జే ట్యాక్స్‌కు భయపడి వెనక్కు వెళ్లాయన్నారు. అక్రమాల వైసీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మలసముద్రం పంచాయతీలో తాగునీటి సమస్య, సీసీరోడ్లు, కోరేవాండ్లపల్లిలో శ్మశానవాటిక సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, తాను నిరంతరం నియోజకవర్గ ప్రజల వెన్నంటి ఉండి అభివృద్ధికి చేస్తామని ఇరువురి తరపున హామీ ఇస్తున్నట్లు సవిత తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట ఆంజనప్ప, రాష్ట్ర వడ్డెర సాధికారిత కన్వీనర్ వడ్డెవెంకట్, మండల కన్వీనర్ సోముశేఖర్, సర్పంచ్ సువర్ణ, అశ్వ త్థరెడ్డి, నిమ్మల యువశేఖర్, రామచంద్రారెడ్డి, అమరనాథ్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, బాబురె డ్డి, బాలక్రిష్ణ, రంగయ్య, దేవాగం క్రిష్టప్ప, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు న్నారు.

బీజేపీ నాయకుల మద్దతు : బీజేపీ మండల నాయకులు మంగళవారం గోరంట్లలోని టీడీపీ కార్యాలయంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవితను కలిశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ ఆదేశాలతో సవిత గెలుపుకోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, మేదర శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, ముంతాజమ్మ, లక్ష్మీదేవి, గంగాధర్, శంకర్, షబ్బీర్, నరసింహులు, హరీష్, వెంకటాచలం, అశోక్, అంజ నేయులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురి చేరిక

గోరంట్ల: మండలంలోని గుట్టిపల్లికి చెందిన 20 కుటుంబాలు మంగళవారం వైసీపీనుంచి టీడీపీలోకి చేరారు. గోరంట్లలోని పార్టీకార్యాలయంలో పెనుకొండ టీడీపీ కూటమి అభ్యర్థి సవిత కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో గుట్టిపల్లికి చెందిన మీసాల ఈశ్వరయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, వెంక టశివారెడ్డి, నరసింహారెడ్డి, రాజారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, నర్సిరెడ్డి, రామ చంద్ర, నేసే సిద్ధప్ప, కురుమాల గంగులప్ప, జంగం నాగమణి, లక్ష్మీపతి, విష్ణు, రాఘవేంద్ర, లక్ష్మీనారాయణ, ఎస్‌వి రమణ తదితరులున్నారు అలాగే రెడ్డిచెరువులపల్లి పంచాయతీ ఉపసర్పంచ్ నరసింహులు, బెల్లాలచెరువు నారాయణప్ప టీడీపీలో చేరారు.

పెనుకొండ టౌన్: మండలంలోని మునిమడుగు గ్రామం నుంచి 25కుటుంబాలు మంగళవారం వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. చేరిన వారిలో దాసరి వెంకటప్ప, కెఆర్ వెంకటరాముడు, డీ శంకర్, పెన్నక్క, అంజనేయులు, సూరప్ప, శ్రీరాములు, అంజనేయులు తదితరులు ఉన్నారు. అలాగే గోనిపేట నుంచి వలంటీరు అశ్వత్థరెడ్డితో పాటు పూజితారెడ్డి, నాగమ్మ, నవీన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సౌజన్య, శాంతిబాయి, రమేష్‌నాయక్, వెంకటరెడ్డి తదితరులు చేరారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వారికి కండువాలువేసి ఆహ్వానించారు.

టీడీపీతోనే ప్రజాసంక్షేమం

టీడీపీ అభ్యర్థి సునీల్‌కుమార్


హారేసముద్రం గ్రామంలో సునీల్‌కుమార్‌కు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

మడకశిర రూరల్, ఏప్రిల్ 16 : టీడీపీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని హరేసముద్రం, బుళ్ళసముద్రం. ఆ మిదాల గొంది పంచాయ తీల్లో ఆయన మంగళవారం టీడీపీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారు. మొదట భక్తరహళ్లి నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరేసముద్రం గ్రామంలో మహిళలు సునీల్ కుమార్ కు హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ... వైసీపీ పా లనలో ఉత్తుత్తి హామీలతో ఐదేళ్లుగా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి కావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావలన్నారు. అలాగే బీ రాయాపురం, ఉప్పార్లపల్లి, ఒంటి పాళ్యం, కంటీపురం అయ్యవార్లపల్లి, ఆమిదాలగొంది, ఏఆర్ రొప్పం, టీడీపల్లి, హెచ్ఆర్ పాళ్యం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాండురంగప్ప, అశ్వత్థరామప్ప, రామాంజనేయులు, కిష్టప్ప, హనుమంతేగౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన


అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మడకశిర టౌన్, ఏప్రిల్ 16: అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం పట్టణంలోని మారుతీనగర్ ఆంజనేయస్వామి ఆలయ అవరణంలో అగ్నిప్రమాదాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇళ్లలో వంటలుచేసే సమయంలో గ్యాస్‌వాడకం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. గ్యాస్ ప్రమాదం చోటుచేసుకున్నప్పుడు మంటలను ఎలా ఆర్పాలనేదానిపై ప్రయోగాత్మకంగా తెలియజేశారు. అదేవిధంగా పెద్దపెద్ద భవంతుల్లో, హోటళ్లలో, వ్యాపార సముదాయాల్లో అగ్నిప్రమాదాలు, విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌లు చోటు చేసుకున్న సమయంలో తీసుకోవాల్సిన సత్వర చర్యలపై వివరించారు. ప్రతి ఒక్కరు అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉంటే విలువైన వస్తు సామాగ్రిని, ఆస్తులను కాపాడుకోవచ్చని, ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులపై డీఎస్పీ విచారణ

గోరంట్ల, ఏప్రిల్ 16: మండలంలో ఇటీవల గౌనివారిపల్లి, గోరంట్లలో నమోదైన ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో పెనుకొండ డీఎస్పీ బాజీజాన్‌సైదా మంగళవారం విచారణ జరిపారు. గౌనివారిపల్లిలో ఉగాది పండుగ సందర్భంగా పార్వేటోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా టీడీపీకి చెందిన దళితుడు లక్ష్మీనరసప్పతో వైసీపీ నాయకులకు వివాదం నెలకొంది. దీంతో వైసీపీ నాయకులు డీలర్ బోయ నారాయణ, తలారి రామచంద్ర, వలంటీర్ హరిక్రిష్ణ, సాయిక్రిష్ణలు లక్ష్మీనర్సప్ప ఇంటిపై దాడిచేసి దుర్భాషలాడారు. ఈ మేరకు పోలీసులు వారిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈవిషయంపై డీఎస్పీ క్షేత్రస్థాయిలో గౌనివారిపల్లికెళ్లి విచారణ చేపట్టారు. అలాగే గోరంట్ల పంచాయతీ ఉప సర్పంచ్ రాజారెడ్డి పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగి ఎలక్ట్రీషన్ వినోద్ వీధి లైటు వేయలేదని నానా దుర్భాలాషాడిన విషయం తెలిసిందే. వినోద్ ఫిర్యాదు మేరకు ఉప సర్పంచ్‌పై పోలీసులు ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయంలోనూ డీఎస్పీ విచారణ జరిపినట్లు పోలీసులు తెలిపారు. ఆయనతోపాటు సీఐ సుబ్బరాయుడు విచారణలో పాల్గొన్నారు

ఘనంగా ఖమ్రుద్దీన్ అలీ గంధంపూజ


గంధాన్ని ఊరేగింపుగా తెస్తున్న మతపెద్దలు

పెనుకొండ, ఏప్రిల్ 16 : పట్టణంలోని గోనిపేట రోడ్డులో వెలసిన షేక్ సయ్యద్‌షా ఖమ్రుద్దీన్‌అలీ దర్గాలో స్వామివారి గంధంపూజోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంక్యూఏ గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహ్మదీయ మతగురువుతో పాటు హిందు, క్రైస్తవ, సూఫీ మతస్థులు పాల్గొన్నారు. వారంతా ఊరేగింపుగా గంధాన్ని దర్గాకు తీసుకొచ్చి స్వామి సమాధికి చాదర్ సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కలీముల్లా, అక్రంఖాన్, ఆదిల్, సురేష్, అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఎగతాళి మీకూ వర్తిస్తుంది కదా..!

● చంద్రబాబుపై రాళ్లదాడిని హేళన చేశారు కదా..?
● వైసీపీ నాయకులకు మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ చురక


మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతున్న నాయకులు

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 16: 'అమరావతి, యర్రగుంటపాళ్యం, పుంగనూరులో టీడీపీ అధినేత చంద్రబాబుపై రాళ్లతో దాడిచేస్తే చిన్న గులకరాయికే చనిపోతారా.. అని ఎగతాళి చేశారు. ఇప్పుడు సీఎం జగన్‌పై గులకరాయి దాడి జరిగింది. దీనికీ నాటి ఎగతాళి మాటలు వర్తిస్తాయి కదా..?' అని మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ అన్నారు. పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గుట్టూరుకు చెందిన 12 కుటుంబాల వారిని పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2018లో ఐజీగా రిటైర్డ్ అయ్యానని, అప్పట్లో పోలీసుల సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశానని అన్నారు. హిందూపురంలో అబ్దుల్‌ఘని రాజకీయాల నుంచి తప్పుకున్న తరువాత తనను నైట్‌వాచ్‌మన్‌లా అక్కడికి పంపారని ఆరోపించారు. ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతో తన కష్టానికి ఫలితం దక్కిందని భావించానని, కానీ పరిస్థితులు అందుకు విరుద్ధంగా మారిపోయాయని అన్నారు. వైసీపీ హిందూపురం అభ్యర్థిని ప్రకటించిన సమయంలో ఆ పార్టీ నాయకుల ప్రవర్తన, తీరు తనకు బాధ కలిగించిందని అన్నారు. అందుకే తల వంచలేక ఎమ్మెల్సీ పదవికి, వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరానని అన్నారు. అధికార పార్టీ మైనార్టీలకు చేసింది ఏమీ లేదని, చంద్రబాబుతోనే మైనార్టీల గుర్తింపు అని అన్నారు. వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. వైనాట్ 175 కాదు మైనస్ 175 చేసుకోవాలని ఎద్దేవా చేశారు. ప్రజలు మంచి పాలన కోరుకుంటున్నారని, టీడీపీ విజయ ఢంకా మోగించడం తథ్యమని అన్నారు. పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎనలేనివని, నిత్యం ప్రజల్లో ఉంటున్న ఆమె గెలుపును ఎవరూ ఆపలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాసులు, మైనార్టీ నాయకుడు దాదు, త్రివేంద్రమూర్తి, గుట్టూరు సూరి తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలనను అంతమొందిద్దాం

టీడీపీ నాయకులు

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 16: వైసీపీ రాక్షస పాలనను అంతమొందిద్దామని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. పరిగి మండల పరిధిలోని శాసనకోట, నేతులపల్లి, సుబ్బరాయునిపల్లి, ఎర్రగుంట తదితర ప్రాంతాల్లో మంగళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించ ఆరు. ఇంటింటికి తిరిగి ప్రజలను చైతన్యపరిచారు. ఈ ఐదు సంవత్సరాలు రాక్షస పాలన సాగిందని, వారి ఆగడాలను అరికట్టాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని సూచించారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సూర్యనారాయ, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు ఈశ్వరయ్య, శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ నరసింహమూర్తి, నాయకులు మారుతి, ప్రవీణ్‌రెడ్డి, మహేష్, వందలాదిమంది కార్యకర్తలు హాజరయ్యారు.

పెనుకొండ రూరల్ : టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రఘువీరా చౌదరి, మాజీ ఎంపీపీ కేశవయ్య ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని మావటూరులో టీడీపీ నాయకులు విస్తృతంగా ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ తిరుగుతూ తెలుగుదేశం ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, గోపాల్, వెంకటేష్, కోనాపురం రామలింగ, సోమశేఖర్, మాజీ డీలర్ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అగళి : టీడీపీని గెలిపించుకునిచంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామని టీడీపీ ఎస్సీసెల్ నాయకులు మండల నాయకుల పేర్కొన్నారు. ఎంపీటీసీ నాగోజీ, తాలూక ఎస్సీసెల్ నాయకులు భీమరాజు, క్యాతప్ప తదితరులు మంగళవారం మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు కంబన్న, అలీఖాన్, ఆదినారాయణ, దినేష్, లక్ష్మమ్మ, నాగమణి, భీమరాజ్, మంజునాథ్, నాగరాజ్ తదితరులు ఉన్నారు.

పార్థ, పరిటాల సునీతను కలిసిన కొల్లకుంట అంజినప్ప


పరిటాల సునీతకు కృతజ్ఞతలు తెలుపుతున్న కొల్లకుంట అంజినప్ప

పెనుకొండ, ఏప్రిల్ 16 : టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన కొల్లకుంట వడ్డె అంజినప్ప మంగళవారం జిల్లా నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన మంగళవారం మాజీ మంత్రి పరిటాల సునీతను అనంతపురంలోని ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం హిందూపురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవితను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ పదవి వచ్చేందుకు కృషిచేసిన వారిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపానన్నారు. ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి శక్తివంచనలేకుండా కృషిచేస్తానన్నారు. ఆయన వెంట వడ్డెరసంఘం నాయకులు వీజీపాళ్యం శ్రీనివాసులు, పరిగి హనుమయ్య, రమేష్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్‌కు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

అగళి, ఏప్రిల్ 16 : మండల కేంద్రంలోని పలు సర్వే నంబర్లలో లేఅవుట్‌లు వేసిన లక్ష్మీనారాయణ భూముల విషయంలో సోమశేఖర్ అనే వ్యక్తి చీటింగ్‌కు పాల్పడినట్లు నిర్ధారించినట్టు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. అతడిని అరెస్ట్‌చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని అగళికి వెళ్లే జాతీయ రహదారి పక్కన 186-1సర్వే నంబరుకు చెందిన 1.83సెంట్లు, 187-3ఎ సర్వే నంబరుపై 0.84సెంట్లు, 187-4ఎ సర్వే నంబరు పై 0-86సెంట్లు మొత్తం 3.53ఎకరాల్లో లక్ష్మీనారాయణ లేఅవుట్ వేశారన్నారు. అయితే సోమశేఖర్ లక్ష్మీనారాయణ కు తెలియకుండా ఆ ప్లాట్‌లను పలువురికి అగ్రిమెంట్ వేసి వారి నుంచి నగదును తీసుకున్నాడన్నారు. అలాగే మొత్తం 3.53ఎకరాల్లో లేఅవుట్‌వేసిన భూమిని లక్ష్మీనారాయణకు తెలియకుండా ఇతరుల పేరిట హిందూపురంలో రిజిస్ట్రేషన్ చేయించి లక్ష్మీనారాయణను చీటింగ్ చేశాడని ఎస్ఐ తెలిపారు. లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు బెంగళూరులోని ఇస్రో కంపెనీ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న సోమశేఖర్ అరెస్ట్‌చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదకరంగా పైప్‌లైన్ పనులు

రొద్దం, ఏప్రిల్ 16 : మండలపరిధిలోని నల్లూరులో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు కోసం చేస్తున్న పనులు ప్రమాదకరంగా మారాయి. మండల పరిధిలోని నల్లూరులో బీసీ కాలనీకి వెళ్లే సీసీ రోడ్డులో పది అడుగుల గుంతతీసి పైప్‌లైన్ వేశారు. అయితే ఆ గుంతను పూడ్చకుండా వదిలేశారు. అది ద్విచక్రవాహన దారులకు ప్రమాదకరంగా మారింది. రాత్రిపూట ఎవరైనా అటుగా వెళ్తే ప్రమాదం పొంచి ఉన్నట్టే అనే విమర్శలు వ్య క్తం అవుతున్నా యి. ఇటీవల గ్రామంలో తాగు నీటి సమస్య ఏర్పడడంతో స్థానిక సర్పంచ్ క్రిష్ణప్ప తన బోరు ద్వారా పంచాయతీకి పైప్‌లైన్ వేసి నీరందిస్తు న్నారు. అయితే పైప్‌లైన్ కోసం సీసీ రోడ్డులో తీసిన గుంతను పూడ్చక పోవడంతో... అది ప్రమాదకరంగా మారిందని గ్రామస్థులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా రోడ్డుపై ఉన్న గుంతను పూడ్చివేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


రోడ్డుకు అడ్డంగా తవ్విన గుంత ఇదే